క్లుప్తంగా

కనుల పండువగా గోమాత కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని గోమాత కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. స్థానిక కోదండ రామాలయంలో గోమాతలకు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశం, నాయకులు దిడ్డి శంకరయ్య, కామరాజు, సంతోష్‌రావు పాల్గొన్నారు.

కార్మిక సంఘం ప్రతినిధికి సన్మానం



సన్మానిస్తున్న టీజీపీఈయూ ప్రతినిధులు

రామగుండం: ఇటీవల కేశోరాం సిమెంట్ కర్మాగారంలో జరిగిన కాంట్రాక్టు కార్మిక సంఘం ఎన్నికల్లో గెలుపొందిన కౌశిక హరిని శనివారం తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధం) ప్రతినిధులు సత్కరించారు. బీఎంఎస్ ప్రతినిధులు లగిశెట్టి రవికుమార్, గుర్రాల నర్సింహులు, నూనె రాజేందర్, జాగటి శ్రీకాంత్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న సెక్యూరిటీ గార్డులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2ఏరియా సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేసిన కొంకటి అంజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి కుటుబానికి తోటి సెక్యూరిటీ గార్డులు అండగా ఉండి చేయూతనందించారు. అందరూ కలిసి సేకరించిన రూ.లక్ష ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. సెక్యూరిటీ సీనియర్ ఇన్‌స్పెక్టర్ రాజలింగం, జూనియర్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

జూలపల్లి: భూసారాన్ని పెంచి అధిక దిగుబడి సాధించేందుకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అందుబాటులో ఉన్నాయని ఏఈవో శ్రీవాణి తెలిపారు. అవసరమున్న రైతులు పట్టాదారు పాస్‌బుక్ తీసుకువచ్చి విత్తనాలు తీసుకెళ్లాలని సూచించారు.

28న మండల సర్వసభ్య సమావేశం

ఓదెల: మండల పరిషత్ కార్యాలయంలో 28న సర్వసభ్య సమావేశం ఉదయం 10గంటలకు ఎంపీపీ కునారపు రేణుకదేవి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో తిరుపతి తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హాజరవుతారని పేర్కొన్నారు. సభ్యులు, సంబంధిత శాఖాధికారులు హాజరు కావాలని సూచించారు.

వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎస్సై మధుసూదన్‌రావు

ముత్తారం: ముత్తారంలోని కాసర్లగడ్డ చౌరస్తాలో శనివారం రాత్రి ఎస్సై మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై చర్యలు ఉంటాయన్నారు.

రేపు వారసంత తైబజారు వేలం

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటలో వారసంత తైబజారు వేలం సోమవారం ఉదయం గ్రామ పంచాయతీలో నిర్వహించనున్నట్లు కార్యదర్శి అంజలీధర్ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఇసుక రవాణాపై నియంత్రణ కరువు

- ట్రాక్టర్ల అధిక వేగంతో ప్రమాదాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



జూలపల్లిలో వేగంగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్

జూలపల్లి: అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో ఇసుకను ఇష్టం వచ్చినట్లు రవాణా చేయడమే కాక నియంత్రణ లేని వేగంతో ప్రమాదాలకు కారకులవుతున్నారు. మండలంలో ఇళ్లు నిర్మించుకునే వారికి ఇసుక అవసరమే కానీ రవాణా చేయడంలో ఇసుక ట్రాక్టర్లు ఇష్టం వచ్చినట్లు అధిక వేగంతో వెళ్తుండడంతో వాహనదారులు, గ్రామాల్లోని ప్రధాన రోడ్డు వెంట ఉన్న ఇళ్ల యజమానులు ఆందోళన చెందుతున్నారు. రవాణాశాఖ అధికారులు దృష్టి సారించక పోవడంతో ట్రాక్టర్ల వేగ నియంత్రణ లేక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సుల్తానాబాద్ మండలంలోని మానేరు నుంచి ప్రధానంగా ఇసుక రవాణా జరుగుతోంది. గతంలో తెలంగాణ సాండ్ ట్యాక్స్ పేరుతో సీరియల్ ప్రకారం ట్రాక్టర్లనుతో రవాణా చేసిన అధికారులు కొంత వరకు మెతక వైఖరి అవలంభించడంతో జోరుగా అక్రమ రవాణా చేస్తున్నారు. అయినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాలుగు నెలల క్రితం అత్యధిక వేగంతో సుల్తాన్‌పూర్ వద్ద బైక్‌ను తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న గోడను ఢీకొని, వాహనదారులు డ్రైనేజీలో పడగా తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. అయినా అధికారులు ట్రాక్టర్ల వేగంపై చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టి, ట్రాక్టర్ల వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇసుక, మట్టి అక్రమ రవాణాపై చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమానాయక్

మంథని: డివిజన్‌లోని ఆయా మండలాల పరిధిలో ఇసుక, మట్టి అక్రమంగా రవాణా చేసే వారిపై చర్యలు తీసుకోవాలని మంథని ఆర్డీవో హనుమానాయక్ తహసీల్దార్‌ను ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శనివారం డివిజన్‌లోని తహసీల్దార్లతో సమావేశమయ్యారు. జాతీయ రహదారి నిర్మాణంలో భూమి, ఇతరత్రా ఆస్తులు కోల్పోతున్న వారికి పరిహారం చెల్లించడానికి పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంకు, ఆధార్ ప్రతులను మూడురోజుల్లో సేకరించాలన్నారు. భూసేకరణలో ముంపునకు గురవుతున్న పైప్‌లైన్, బావులు, బోర్లకు సంబంధించి అంచనాలు పూర్తి చేయాలన్నారు ధరణి పోర్టల్‌లో పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌కు సంబంధించి ఎప్పటికప్పుడు నివేదికలు పంపించాలన్నారు. మంథని, రామగిరి ముత్తారం తహసీల్దార్లు రాజయ్య, రాంచందర్, సుమన్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



మొక్క నాటుతున్న హైకోర్టు జడ్జి నంద

సుల్తానాబాద్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ఉందని హైకోర్టు జడ్జి, జిల్లా పోర్టు ఫోలియో జడ్జి సూరపల్లి నంద అన్నారు. శనివారం రాత్రి జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా సుల్తానాబాద్ కోర్టు ఆవరణను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విశాలమైన స్థలం కోర్టుకు ఉండడం వరం లాంటిదన్నారు. మొక్కలు నాటడమే కాకుండా సంరక్షించాలని న్యాయవాదులకు సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములుగౌడ్, ప్రధాన కార్యదర్శి జోగుల రమేశ్, ఏజీపీ తిరుపతిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు సర్వోత్తమ్‌రెడ్డి, ఆంజనేయులు, లక్ష్మీరాజ్యం, బాల కిషన్‌ప్రసాద్, రవీందర్, భూమయ్య, శివ, రాజు, సామల రాజేంద్రప్రసాద్, కరుణాకర్, అడ్డగుంట కిరణ్‌గౌడ్, రాజయ్య, పడాల అంజయ్యగౌడ్, శ్యామ్‌పటేల్ నర్సయ్య ఉన్నారు.

కూడళ్లపై పోలీసుల ప్రత్యేక నిఘా



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పలు కూడళ్లలో అడ్డాలు వేస్తున్న పోకిరీలపై అంతర్గాం పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఇందులో భాగంగానే అంతర్గాం ఎస్సై బోయ వెంకట్ ఆకస్మికంగా పలు గ్రామాల్లోని ముఖ్య కూడళ్లను సందర్శించారు. కాగా పోలీసులను చూసి కొంతమంది పరుగులు పెట్టగా పలువురు అక్కడే కూర్చొని ఉన్న వారి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభం కావడంతో పోకిరీలు గంజాయి, మాదకద్రవ్యాలను సేవిస్తూ కూడళ్ల వద్ద అడ్డాలు వేస్తూ అమ్మాయిలతో అసభ్యకరంగా వ్యవహరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రతి గ్రామ ప్రధాన కూడళ్లతో పాటు మారుమూల ప్రదేశాల్లో అడ్డాలు వేసి గంజాయి సేవిస్తున్నట్లు అనుమానం ఉన్న ప్రాంతాలపై నిఘా పెట్టామని పేర్కొన్నారు. గ్రామ కూడళ్లలో అడ్డాలు వేసే యువకుల వివరాలను తమకు తెలియజేయాలని, తమకు సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్సై ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రామగుండం బల్దియా ఈఈగా పీవీ రామన్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)గా పీ.వీ.రామన్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. గతంలో రామగుండం నగరపాలక సంస్థలోనే ఏఈగా రామన్ బాధ్యతలు నిర్వహించారు. తర్వాత పదోన్నతిపై పలు మున్సిపాలిటీల్లో పనిచేసిన రామన్, రెండేళ్ల క్రితం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏసీబీ అధికారులు జరిపిన దాడుల్లో పట్టుపడ్డారు. లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న రామన్, రెండేళ్ల తర్వాత రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఈఈగా బదిలీపై వచ్చారు.

మెడికల్ బోర్డు నిబంధనలు మార్చకుంటే ఆందోళనలు



మాట్లాడుతున్న ధర్మపురి

గోదావరిఖని: సింగరేణిలో మెడికల్ బోర్డు నిబంధనలు మార్చి డిపెండెంట్లు అందరికీ ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి కోరారు. శనివారం జీడీకే–5గనిపై ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తమ యూనియన్ కృషితోనే 35 ఏళ్ల నుంచి 40ఏళ్లకు డిపెండెంట్ వయస్సు పెంచుతూ యాజమాన్యం నిర్ణయం తీసుకుందని తెలిపారు. కార్మికుల సొంతింటి కలపై పలు ఏరియాల్లో ఉన్న స్థలాల సేకరణ, వాటి సాధ్యాసాధ్యాల గురించి యాజమాన్యం దృష్టి సారించాలని అన్నారు. పెర్క్స్‌పై ఇన్‌కంట్యాక్స్ యాజమాన్యమే చెల్లించాలన్నారు. మెడికల్ బోర్డు 24నెలల కాలపరిమితి తొలగించి దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఎలాంటి డబ్బులు లేకుండా మెడికల్ అన్‌ఫిట్ చేయాలన్నారు. మహిళా కార్మికులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని కోరారు. కొత్త బొగ్గు గనులు ఏర్పాటు చేసిన ఈప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీపతిగౌడ్, గడ్డం కృష్ణ, ఆంజనేయులు, సమ్మయ్య యాదవ్, సాగర్, నాగరాజు, అంజయ్య, మండ రమేశ్, మల్లికార్జున్, బేబీ శ్రీను, పుట్ట రమేశ్, తాళ్ల కుమార్ పాల్గొన్నారు.

వ్యాపారులపై కేసు

మంథని: లీగల్ మెట్రాలజీ అధికారులు శనివారం పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. పలు దుకాణాలను తనిఖీ చేసి ఎలక్ట్రానిక్ కాంటాలు పరిశీలించారు. స్టాంపు లేనివి, తూనికలు సరిగ్గా లేనివి గుర్తించి సీజ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన ఆరుగురిపై కేసులు నమోదు చేసి రూ.31,500 జరిమానా విధించినట్లు లీగల్ మెట్రాలజీ జిల్లా అధికారి విశ్వేశ్వర్ తెలిపారు. వ్యాపారులు తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ కాంటాలు వినియోగించాలని, వాటికి స్టాంపులు తప్పనిసరి వేయించాలని సూచించారు. లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ట్యాంకుల వద్ద శుభ్రంగా ఉంచాలి

సుల్తానాబాద్: వాటర్ ట్యాంకుల వద్ద గేట్‌వాల్ ఉంటుందని, అపరిశుభ్రంగా ఉండడంతో విషసర్పాలు వచ్చే అవకాశం ఉన్నందున శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ సూచించారు. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో ఉన్న పూసాల వాటర్ ట్యాంక్ వద్ద పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయని స్థానికులు తెలపడంతో శనివారం స్పందించి జేసీబీ సహకారంతో తొలగించారు. మున్సిపల్ సిబ్బంది రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

'మోడల్'లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి మోడల్ స్కూల్‌లో ఖాళీ సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రఘునాథ్ తెలిపారు. 6, 7, 8, 10వ తరగతుల్లో ఖాళీ సీట్ల కోసం జూన్ 30లోపు నేరుగా పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'మోడల్' విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి



వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాస్

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఎఫ్‌సీఐ ఎల్కలపల్లి గేట్ నుంచి లింగాపూర్ మోడల్ స్కూల్‌కి వెళ్లే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ 14వ డివిజన్ అధ్యక్షుడు బూర్ల శ్రీనివాస్ శనివారం గోదావరిఖని డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ దృష్టికి తీసుకెళ్లారు. మోడల్ స్కూల్ బస్సును ఎల్కలపల్లి గేట్ వరకు పొడిగించేలా చర్యలు తీసుకునేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. గౌతమ్ సతీశ్, రాజేశ్, శైలేందర్, సుజాత పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శనివారం కలెక్టర్ కోయ శ్రీహర్షను కలిశారు. కలెక్టర్‌కు మొక్క అందించి శాలువాతో సత్కరించారు.

సీఐ బదిలీ

గోదావరిఖని: రామగుండం పోలీస్‌కమిషనరేట్ వీఆర్–2 సీఐగా పనిచేస్తున్న సీహెచ్ రాజమౌళిని శ్రీరాంపూర్ మహిళా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. శనివారం ఆదేశాలు జారీ అయ్యాయి.

వృద్ధుడి మృతి

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారు బందంపల్లికి చెందిన గట్టు రాయమల్లు (70) అనే వృద్ధుడు శనివారం మరణించాడు. ఒంటరి అయిన రాయమల్లు ఎండ దెబ్బకు గురై మరణించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడి కుమారుడు సత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

24న వారసంతకు వేలం

ధర్మారం: మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారసంతకు 24న ఉదయం 10గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌బాబు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.50వేలు డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

శ్రీఅయ్యప్పస్వామి మండపం పునర్‌నిర్మాణం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్ వైకుంఠపురంలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయ మండపం పునర్‌నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు తెలిపారు. దాతలు సంపత్‌రావు 9494800632 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేత్రదానం

రామగుండం: సీనియర్ జర్నలిస్టు, రైల్వే ఉద్యోగి సిమ్మని శ్రీనివాస్(57) ఇటీవల బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మృతుడి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించగా నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఫౌండేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కేఎస్.వాసు ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఎస్‌కే.ఆరిఫ్ సహకారంతో మృతుడి నుంచి నేత్రాలను హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు.

ఇంటింటా భగీరథ సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో వేణుగోపాల్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న మిషన్ భగీరథ ఇంటింటా సర్వే ప్రక్రియను శనివారం డివిజనల్ పంచాయతీ అధికారి వేణుగోపాల్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, పొట్యాల తదితర గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించి సర్వే పనులను పరిశీలించారు. ఎంపీవో అబ్దుల్ వాజీద్, పంచాయతీ కార్యదర్శులు గంగలక్ష్మి, గీతావాణి ఉన్నారు.

మహిళల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్: మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ సర్కార్ కట్టుబడి ఉందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం 37 మంది లబ్ధిదారులకు రూ.37.40లక్షల విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. అంతకు ముందు మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యేను ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, ఎంపిడీవో రామ్మోహనాచారి, ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. తహసీల్దార్ జాహెద్ పాషా, వైస్ ఎంపీపీ జూకంటి శిరీష, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, ఎంపీటీసలు దేవయ్య, నిర్మల, రావి సదానందం పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం స్కీం ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

సుల్తానాబాద్/ఎలిగేడు: ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్ నాయక్ కోరారు. ఎలిగేడు మండలం శివపల్లిలోని ఎమ్మెల్యే గృహంలో శనివారం ఎమ్మెల్యే విజయరమణారావుకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ హెల్త్ మిషన్ స్కీంలో పనిచేస్తున్న ఉద్యోగులను సీఎం వద్దకు తీసుకెళ్లి తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని, సంవత్సరానికి 35 లీవులు ఇవ్వాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ప్రమాదం జరిగితే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. ప్రభాకర్, తిరుపతి, గోపీకృష్ణ, సురేందర్, శ్రావణ్, సదాశివ్, శంకర్, మునీర్, అనిల్ ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ కృష్ణమూర్తి

గోదావరిఖని: సైబర్ నేరగాళ్లు విజృంభిస్తూ అందినంత దోచుకుంటున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని సైబర్‌క్రైం సీఐ జూపాక కృష్ణమూర్తి అన్నారు. శనివారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 కృషిభవన్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం పెరుగుతున్న టెక్నాలజీకి తోడు సైబర్ నేరాలు కూడా అదే స్థాయిలో జరుగుతున్నాయన్నారు. ప్రతిరోజూ సైబర్ నేరస్తుల చేతిలో అమాయక ప్రజలు మోసానికి గురవుతున్నారని పేర్కొన్నారు. బ్యాంకులకు సంబంధించిన వివరాలు, అపరిచిత కాల్స్, లింక్‌లు, మెసేజ్‌లకు ఎటువంటి సమాధానం ఇవ్వొద్దని సూచించారు. సేఫ్టీ ఆఫీసర్ భారత్‌కుమార్, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, కానిస్టేబుళ్లు వెంకటేశ్, శ్రీనివాస్, పిట్ సెక్రటరీ రాజయ్య పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 మైన్ ఆవరణంలో సింగరేణి కార్మికులకు సైబర్ క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం సైబర్ మోసాల నియంత్రణపై అవగాహన కల్పించారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. క్రెడిట్ కార్డ్స్, రిలేటెడ్ మోసాలు, లోన్ యాప్ ఓటీపీలు వంటిపై అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. సైబర్ పోలీసులు వెంకటేశ్, కుమార్, శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి



షీల్డ్ అందిస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు ప్రకాశ్‌రావు

సుల్తానాబాద్: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని డీసీసీ ఉపాధ్యక్షుడు మినుపాల ప్రకాశ్‌రావు అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలో ఉన్న శాస్త్రినగర్ క్రీడామైదానంలో బండి సుమన్‌గౌడ్ స్మారక డివిజన్ స్థాయి క్రికెట్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఫైనల్లో సుల్తానాబాద్‌లోని మార్కండేయ కాలనీ, ఓదెల మండల కేంద్రంలోని లెజెండ్ టీమ్ పోటీ పడగా మార్కండేయకాలనీ జట్టు గెలిచింది. మొదటి బహుమతి రూ.15వేల నగదుతో పాటు షీల్డ్, రెండో బహుమతి రూ.8వేలతో పాటు షీల్డ్ అందజేశారు. కాంగ్రెస్ నాయకులు గాజుల రాజమల్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, సాయిరి మహేందర్, కౌన్సిలర్లు తిరుపతి, రాజు, మండల అధ్యక్షులు మూల ప్రేమ్‌సాగర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అబ్బయ్యగౌడ్ పాల్గొన్నారు.

మహిళలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై శివాణిరెడ్డి

పాలకుర్తి: మహిళలను ఇబ్బందులకు గురిచేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని బసంత్‌నగర్ ఎస్సై శివాణిరెడ్డి అన్నారు. బసంత్‌నగర్‌లోని ఇండియా మిషన్ సెకండరీ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు మహిళలపై నేరాలు, సైబర్ నేరాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, షీ టీంలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు మరింత దగ్గరై సేవలు అందిస్తున్నామని, ఏదైనా సమస్య ఉంటే 100కు డయల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మహేంద్రన్, గాయత్రి పాల్గొన్నారు.

క్వార్టర్లను వినియోగంలోకి తీసుకువస్తాం

సుల్తానాబాద్: క్వార్టర్లకు మరమ్మతు చేసి ఉపయోగంలోకి తీసుకువస్తామని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు అన్నారు. క్వార్టర్లు శిథిలావస్థలో ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఇటీవల సాక్షి దినపత్రిలో కథనం ప్రచురిచమైంది. స్పందించిన ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు శనివారం మండల అధికారుల బృందంతో కలిసి క్వార్టర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాలకవర్గం ఆమోదంతో కలెక్టర్‌కు సిఫార్సు చేసి మరమ్మతుకు నిధులు మంజూరు చేసేలా చూస్తామని పేర్కొన్నరు. వెంటనే మరమ్మతు చేసి పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉపయోగించుకునేలా తమవంతు ప్రయత్నం చేస్తామన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్, పంచాయతీరాజ్ డీఈఈ దేవేందర్, ఏఈ సతీశ్ ఉన్నారు.

యువత భవిష్యత్ నాశనం చేసుకోవద్దు

ముత్తారం: మత్తు పదార్థాలకు అలవాటు పడి యువత భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్సై మధూసూదన్‌రావు సూచించారు. శనివారం మండలంలోని పారుపల్లిలో పోలీసు కళాకారుల బృందం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సై మాట్లాడారు.

మురుగు కాలువల్లో చెత్త తొలగింపు



చెత్త తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి రోడ్డుపై వరద నీరు నిలిచింది. సాక్షి దినపత్రికలో శనివారం 'నిలిచిన వరద నీరు' కథనం ప్రచురితమైంది. స్పందించిన రామగుండం మున్సిపల్ సిబ్బంది, శానిటరీ సూపర్‌వైజర్ అడప సోమేశ్ సిబ్బందితో శనివారం కాలనీలోని సంతోషనగర్, అల్లూరు రోడ్డుపై నిలిచిన వరద నీటిని బురదను, మురికి కాలువల్లోని చెత్తాచెదారాన్ని తొలగించారు. సోమేశ్ మాట్లాడుతూ కాలువల్లో చెత్త వేయకుండా ఇంటికి వచ్చే చెత్త ట్రాలీలో వేయాలని సూచించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పారిశుధ్య సిబ్బంది నరేశ్, శేఖర్ పోషం ఉన్నారు.